రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఆర్.నవిత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. ఆదిలాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా జోనల్ లెవెల్ అండర్-17 బాల బాలికల కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్‌లో పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన ఆర్.నవితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీపీ అయేషాఅఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీలు సరళ శ్రీనివాస్‌గౌడ్, దేవోజి భూమేష్, పాఠశాల చైర్మన్, కోఆప్షన్ మెంబర్ ఖాలిద్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
గురువారం | డిసెంబర్ 21, 2023 | www.navatelangana.com

పార్లమెంట్ ముట్టడిలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ నుండి కాంగ్రెస్, విపక్ష సభ్యుల సస్పెన్షన్‌ను నిరసిస్తూ బుధవారం ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ నిర్వహించిన పార్లమెంట్ ముట్టడిలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళ్లిన నాయకులు పార్లమెంట్ వద్ద ఆందోళన చేపట్టారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, అసెంబ్లీ అధ్యక్షుడు అర్బాత్‌ఖాన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, బోథ్ అసెంబ్లీ అధ్యక్షుడు పోతారెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఆదర్శ విద్యార్థులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థినీ బి.సాయి దీక్ష , సిర్పూర్(యూ) ఆదర్శ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినీ జే.లోకేశ్వరి రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆసిఫాబాద్, సిర్పూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాళ్లు అబ్దుల్ ఖలీల్, ఎం.వెంకటస్వామి తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి జోనల్ స్థాయి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. సాయి దీక్ష, లోకేశ్వరి 21 నుంచి 23 వరకు హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఇరు పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, ఉపాధ్యాయులు, పీడీలు ఆత్రం ధర్మారావు, బి.తిరుపతి అభినందించారు.

ఉమ్మడి సాఫ్ట్, బేస్‌బాల్ జట్టు ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల మైదానంలో అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్ బాల్, బేస్ బాల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్ హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉటూరి శ్రీనాథ్, పీడీ సట్ల శంకర్, ఉమ్మడి ఆదిలాబాద్ కార్యదర్శి బి.బాబురావు, కోట యాదగిరి, రాకేష్, సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామ కస్తూర్బా గాంధీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు రసాయన శాస్త్ర ప్రయోగాలు, మానవ శరీర అంతర్గత అవయవ భాగాల పనితీరును వివరించారు. జిల్లా జిజ్ఞాస సంచార ప్రయోగశాల ఆధ్వర్యంలో నిర్వహించారని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి తెలిపారు. కార్యక్రమంలో జిజ్ఞాస సంచార ప్రయోగశాల అధ్యాపకులు సాయికుమార్, సంపత్, సైన్స్ అధికారి మధుబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి పట్టుకున్న పోలీసులు



తాండూర్: బెల్లంపల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. బస్టాండ్ ప్రాంతంలో షేక్ జమీర్ వద్ద 350 గ్రాముల గంజాయి పట్టుకున్నట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. తమకు అందించిన సమాచారం మేరకు బెల్లంపల్లి తహసీల్దార్‌తో కలిసి నిందితున్ని పట్టుకున్నట్టు తెలిపారు. నిందితుడు గంజాయికి బానిసై ఏ పని చేయకుండా షేక్ యునుస్‌తో కలసి బలార్ష నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్టు విచారణలో తెలిసిందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. గంజాయి సేవించిన అమ్మడం అమ్మిన చట్ట రిత్య చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ట పర్చాలి



నవతెలంగాణ-తాండూర్

పెట్రోలింగ్ వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేసి దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని ఏసీపీ సదయ్య సూచించారు. బుధవారం బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ఎంత పని చేస్తున్నారు..? నమోదైన కేసుల వివరాలను ఎస్సై రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకాలు, వినియోగాలను నిరోధించాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికతో పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. బాధ్యతయుతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందుతూ మంచి పేరు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ రాజ్ కుమార్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.

అధికారంపై అవిశ్వాసం..!

- ప్రభుత్వం మారడంతో హస్తం వైపు మెజార్టీ కౌన్సిలర్లు
- చైర్మెన్ పదవి దక్కించుకునేందుకు సీనియర్ల ప్రయత్నం
- అధికారులకు నోటీసులు..సమావేశానికి సమాయత్తం
- ఉమ్మడి జిల్లా మున్సిపాలిటీల్లో ప్రకంపనలు
- తాజా పరిణామాలతో బీఆర్‌ఎస్ ఉక్కిరిబిక్కిరి

పురపాలక అధికార పీఠాలపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుత పురపాలక చైర్మెన్లను గద్దె దించేందుకు మెజార్టీ కౌన్సిలర్లు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం మారిన పది రోజుల్లోనే మెజార్టీ మున్సిపాలిటీల్లో ఈ అవిశ్వాసం లొల్లి ప్రారంభం కావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని మున్సిపాలిటీల్లో ఇప్పటికే చైర్మెన్లు, వైస్ చైర్మెన్లపై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు ఉన్నతాధికారులకు నోటీసులు అందించగా.. వాటిలో నిబంధనల మేరకు ఉన్నాయా లేదా అనేది అధికారులు నిర్ధారణ కూడా పూర్తిచేసినట్లు తెలిసింది. అతి త్వరలోనే ఆయా చోట్ల చైర్మెన్లు మారిపోయే అవకాశం ఉండగా.. ఒకటి రెండు మున్సిపాలిటీల్లో మాత్రం చైర్మెన్లు అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరి పదవిలో యథావిధిగా కొనసాగాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్, కాగజ్‌నగర్, ఖానాపూర్, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో అధికారులకు అవిశ్వాస నోటీసులు అందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్‌లో ఈ ప్రక్రియ ప్రకంపనలు సృష్టిస్తోంది.



కలెక్టర్ బదావత్ సంతోష్‌కు అవిశ్వాస నోటీస్ అందజేస్తున్న నస్పూర్ కౌన్సిలర్లు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మున్సిపాలిటీల్లో అవిశ్వాస తీర్మాణాల పరంపర ప్రారంభమైంది. ఇన్నాళ్లు అధికారంలో కొనసాగిన చైర్మెన్లపై సభ్యులు అవిశ్వాసం తీర్మాణం పెట్టెందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం మారిన పది రోజుల్లోనే ఈ ప్రకంపనలు రేగడం చర్చనీయాంశమవుతోంది.ఇప్పటికే కొన్ని చోట్ల బీఆర్‌ఎస్‌కు చెందిన మెజార్టీ కౌన్సిలర్లు అధికార కాంగ్రెస్‌లో చేరిపోగా.. మరికొందరు అదే బాటను అనుసరించేందుకు సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీ ఎన్నికలకు మరో ఏడాది గడువు ఉండగానే..పాలకపక్షాలు మారిపోతుండటం హాట్‌టాపిక్‌గా మారుతోంది. ఆయా మున్సిపాలిటీల్లో గతంలో చైర్మెన్ పదవి ఆశించి భంగపడిన సీనియర్ కౌన్సిలర్లు ప్రజాప్రతినిధుల అండదండలతో తాజాగా ఆ పదవిని దక్కించుకునేందుకు సిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే ఐదు మున్సిపాలిటీల్లో ఈ తతంతం కొనసాగగా.. మరిన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఎదురయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లోకి జంప్..!

రాష్ట్రంలో పదేండ్ల పాటు బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో కొనసాగింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీలు ఉండగా మందమర్రి మినహా 11 పురపాలకల్లో పాలకపక్షాలు ఉన్నాయి. వీటిలో భైంసా మినహా అన్నింటిలోనూ గులాబీ పార్టీకి చెందిన చైర్మెన్లు కొనసాగుతున్నారు. తాజాగా పది రోజుల క్రితం రాష్ట్రంలో ప్రభుత్వం మారడం..నూతనంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంతో అందరి చూపు ప్రస్తుత అధికార పార్టీపై పడింది. ప్రస్తుతమున్న మెజార్టీ కౌన్సిలర్లు సైతం అధికార పార్టీలో చేరేందుకు సిద్ధం కావడం..ప్రస్తుత చైర్మెన్లపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతుండటం చర్చనీయాంశమైంది. మంచిర్యాల మున్సిపాలిటీలో 36వార్డులు ఉండగా 21 బీఆర్‌ఎస్, 14కాంగ్రెస్, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. తాజాగా బీఆర్‌ఎస్ నుంచి 14మంది కౌన్సిలర్లు హస్తం పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం 28కి చేరింది. దీంతో ప్రస్తుత చైర్మెన్ పెంట రాజయ్య, వైస్ చైర్మెన్ ముకేష్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసు అందించారు. నస్పూర్‌లో 25వార్డులు ఉండగా ఇది వరకు 16మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌కు ఉన్నారు. కాంగ్రెస్‌కు 6మంది, సీపీఐకి ఇద్దరు, బీజేపీకి ఒక కౌన్సిలర్ ప్రాతినిధ్యం వహించారు. తాజాగా 9మంది కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ బలం సీపీఐతో కలిపి 17కి చేరింది. బీజేపీ కౌన్సిలర్ సైతం వీరికి మద్దతిచ్చారు. దీంతో ప్రస్తుతం ఈసంపెల్లి ప్రభాకర్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు అందించారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30వార్డులు ఉండగా 27మంది బీఆర్‌ఎస్‌కు ముగ్గురు బీఎస్‌పీ కౌన్సిలర్లు ఉన్నారు. తాజాగా బీఆర్‌ఎస్‌కు చెందిన మెజార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్మెన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మెన్ గిరీష్‌కుమార్‌పై అవిశ్వాస నోటీసు అందించారు. ఖానాపూర్ మున్సిపాలిటీలో 12వార్డులు ఉండగా బీఆర్‌ఎస్‌కు 5మంది, కాంగ్రెస్‌కు 5మంది, బీజేపీకి ఒకరు, మరొకరు స్వతంత్ర కౌన్సిలర్లు ఉన్నారు. తాజాగా మెజార్టీ కౌన్సిలర్లు ప్రస్తుత చైర్మెన్, వైస్ చైర్మెన్ రాజేందర్, ఖలీల్‌పై అవిశ్వాస నోటీసు అందించారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34వార్డులు ఉండగా 25వార్డులకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఎనిమిది మంది కాంగ్రెస్‌కు చెందిన వారు ఉండగా ఒకరు బీజేపీకి ప్రాతినిధ్యం వహించారు. ఇన్నాండ్లు బీఆర్‌ఎస్‌కు చెందిన జక్కుల శ్వేత మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రాతినిధ్యం వహించారు. ఇటీవల ఆమె కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ఆమెపై అవిశ్వాస నోటీసు అందించారు. నిర్మల్‌లోనూ కొందరు కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మరోపక్క ప్రస్తుత మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ త్వరలోనే కాంగ్రెస్‌లో చేరి పదవిలో కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీఆర్‌ఎస్ ఉక్కిరిబిక్కిరి..!

ఉమ్మడి జిల్లాలో ఉద్యమ కాలంతో పాటు అధికారంలో కొనసాగిన పదేండ్ల పాటు ఒక వెలుగు వెలిగిన బీఆర్‌ఎస్ పార్టీని తాజా పరిణామాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పది అసెంబ్లీ స్థానాల్లో కేవలం రెండింటికే పరిమితం కావడం.. కీలక నాయకులు గులాబీ పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతుండటంతో గులాబీ పార్టీ గడ్డుకాలాన్ని ఎదుర్కొంటోందనే ప్రచారం జరుగుతోంది. కీలక పదవుల్లో ఉన్న నాయకులే పార్టీ మారుతుండగా.. కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు సైతం అదే దారిని అనుసరిస్తున్నారు. మున్సిపాలిటీల్లో గులాబీ నుంచి గెలుపొంది చైర్మెన్ పదవులను అనుభవించిన వారిని గద్దె దించి ఆ పదవిని అధిష్టించేందుకు అనేక మంది ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులోనే భాగంగా కొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిపోవడం.. మరికొంత మంది పార్టీలోనే ఉంటూ ప్రస్తుతం ఉన్న వారిని పదవి నుంచి దించేసి ఆ స్థానంలో కూర్చునేందుకు సిద్ధమవుతుండటం చర్చనీయాంశంగా మారింది. మరోపక్క ఇప్పటికే ఉన్నతాధికారులకు అవిశ్వాస నోటీసులు అందించడంతో అధికార యంత్రాంగం ప్రత్యేక సమావేశాల నిర్వహణకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.



ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి

- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారమే గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏరియా స్టోర్స్, ఆర్కే-7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కొన్ని సంఘాలు సింగరేణి ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తున్నాయన్నారు. ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్, హెచ్ఎంఎస్ లాంటి సంఘాలు యాజమాన్యం పంచన చేరి ఎన్నికల నిర్వహణ ఆపాలని సంతకాలు చేశాయన్నారు. ఇవి కార్మిక సంఘాలా? లేక యాజమాన్య తొత్తు సంఘాలా? అని ప్రశ్నించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సింగరేణి ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడంతో కార్మికుల వ్యతిరేకతకు గురై అధికారం కోల్పోయిందని తెలిపారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగానే ఎన్నికలను వాయిదా వేయడానికి చూస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యం అధికం కావడంతో సంస్థ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొందన్నారు. గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించి గెలిపించాలని, తద్వారా హక్కులు సాధించడానికి, ఉన్న హక్కులను కాపాడడానికి పాటుపడతామన్నారు. కార్మికుల సొంతింటి కల అమలుకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.20లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామన్నారు. నూతన బొగ్గు బావులను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కంపెనీలో బొగ్గు తీసే పనిలో కాంట్రాక్ట్ కార్మికుల బదులు పర్మినెంట్ కార్మికులనే నియమించే విధంగా చూస్తామన్నారు. కంపెనీ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యం అందించడానికి కృషి చేస్తామని, రిటైర్ అయిన కార్మికులకు గతంలో మాదిరిగా రిటైర్డ్ అయిన రోజే టర్మినల్ బెనిఫిట్స్ పెన్షన్ గ్రాట్యుటీ ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్కే-7 గని నుండి 60 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.వీరభద్రయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, రాచర్ల చంద్రమోహన్, సంపత్, వేణుమాధవ్, బీర రవీందర్, అఫ్రోజ్‌ఖాన్, గజ్జి రమేష్, ఆకుల లక్ష్మణ్, గొల్లపల్లి రాంచందర్, అశోక్, భీమయ్య పాల్గొన్నారు.



సింగరేణిలో మార్పు కోసం సీఐటీయూను గెలిపించాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో మార్పు రావాలంటే సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)ను గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కస్తూరి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో మార్పులు తీసుకురావాలని కోరారు. సింగరేణిలో గతంలో ఏఐటీయూసీని మూడుసార్లు, ఐఎన్‌టియుసి రెండుసార్లు, టీబీజీకేఎస్ రెండుసార్లు గెలిపించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కొత్త బొగ్గు బావులు రాలేదని, కొత్త ఉద్యోగాలు రాలేదని, ఉన్న నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వాలు కాజేశాయని తెలిపారు. సింగరేణిలో కాంట్రాక్టు, ప్రయివేట్ వ్యవస్థ పెద్ద ఎత్తున పెరిగిందని, పైరవీలు ఎక్కువయ్యాయని, రూ.28వేల కోట్ల బకాయిలు రాలేదని పేర్కొన్నారు. అలాగే కార్మికులకు సొంత ఇంటి పథకాలు అమలు కాలేదని, అలవెన్సులపై ఇన్కమ్ టాక్స్ తిరిగి చెల్లించటం లేదని తెలిపారు. అన్ని రకాల సమస్యలు పరిష్కారం చేయకుండా కార్మిక వర్గాన్ని మోసం చేసిన మూడు సంఘాలను ఓడించాలన్నారు. సీఐటీయూ గెలిపిస్తే కచ్చితంగా అవన్నీ సాధిస్తామని తెలిపారు. సమావేశంలో బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, గోదరి భాగ్యరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, అజయ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ప్రకాష్, నాయకులు సదానందం, కేసిపెద్ది శ్రీనివాస్, శ్రీపతి బానేష్, సంగం రాజయ్య, సతీష్, సాయిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మానం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మెన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద డీఆర్‌ఓ కదం సురేష్‌కు 25 మంది కౌన్సిలర్లు మూకుమ్మడిగా మున్సిపల్ చైర్మెన్ మహమ్మద్ సద్దాం హుస్సేన్‌తోపాటు, మున్సిపల్ వైస్ చైర్మెన్ రాచకొండ గిరీష్ కుమార్‌పై అవిశ్వాస తీర్మానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రాజేందర్ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాగజ్‌నగర్‌కు చెందిన కౌన్సిలర్లకు చైర్మెన్ అందుబాటులో ఉండకపోవడం, అభివృద్ధి పనులకు సహకరించకపోవడంతోనే అవిశ్వాస తీర్మానం చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ పెన్షన్లు అందించడంలో సహకరించకపోవడం, అభివృద్ధి పనులపై సమావేశాల్లో మాట్లాడించకపోవడం బాధాకరమని ఆవేదాన్ని వ్యక్తం చేశారు. డీఆర్‌ఓ ఛాంబర్‌లో కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం అందజేసే క్రమంలో సద్దాం హుస్సేన్ అనుచరులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో కొంత రభస నెలకొంది. కొద్దిసేపు వాగ్వీవాదం చోటు చేసుకున్నప్పటికీ డీఆర్‌ఓ సురేష్ అసహనం వ్యక్తం చేయడంతో సద్దాం హుస్సేన్ వర్గీయులను బయటకు పంపించి అవిశ్వాస తీర్మాన ప్రతులను సమర్పించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.



నేటి ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఉచిత వైద్య శిబిరాన్ని అందరూ వినియోగించుకోవాలని 6వ వార్డు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం ఎలైట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మొదెల గ్రామంలో ఉదయం 10గంటలకు కంటి, ఎముకల వైద్య నిపుణులతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు కేవలం రూ.200కే ఇస్తారన్నారు. గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తోట రమేష్ , బైరం వెంకటేష్ , చాతరాజు రాజేష్, కోడి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబాలను ఆదుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

ఆటో డ్రైవర్ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు షేక్ ఖయ్యూం, కేంద్రే సుదాం కోరారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆటోల బంద్‌లో భాగంగా రెండో రోజు మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ నుంచి ఉట్నూర్ వైపు ఆయా గ్రామాలకు వెళ్లే ఆటోలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా మండల ఆటో యూనియన్ ప్రసిడెంట్ ఫెరోజ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధి కోల్పోతున్నారని అన్నారు. వెంటనే అటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



స్పోర్ట్స్ కిట్ల అందజేత

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్లను, ఎడ్యుకేషన్ కిట్లను అందజేశారు. బుధవారం మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం కేజీబీవీ, జెడ్పీహెచ్ఎస్ బాల సంఘాల పిల్లలకు మండల బాలల పరిరక్షణ కమిటీ మహిత స్వచ్ఛంద సంస్థ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీకాంత్ బాలల హక్కుల గురించి వివరిస్తూ పిల్లలకు ఉన్న హక్కులు, సమస్యల గురించి వివరించారు. మండల అధికారులు ఎల్లవేళలా బాలల రక్షణకు తోడ్పడతారని అన్నారు. మహిత స్వచ్ఛంద సంస్థ తరపున బాల బాలికలకు స్పోర్ట్స్ మెటీరియల్, ఎడ్యుకేషన్ కిట్ అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ శ్రావ్య, అంగన్‌వాడి టీచర్లు, కేజీబీవీ ఎస్ఓ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాల, కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయులు మహిత కోర్డినేటర్ ఇమ్రాన్ ఖాన్ పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ త్వరలో పార్లమెంటు ఎన్నికలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, జాబితాలో తప్పులు లేకుండా రూపొందించాలని అన్నారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించాలని, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు నమోదుపై పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా స్వీప్ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఇప్పటికే పరిశీలించడం జరిగిందని తెలిపారు. చేపట్టనున్న ఇతర ఏర్పాట్లను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, ఆర్డీఓ స్రవంతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా పడిపూజ

నవతెలంగాణ-తాంసి

ఎంతో కన్నుల పండుగగా అయ్యప్ప మహా మెట్ల పడిపూజా కార్యక్రమాన్ని మంగళవారం మండల కేంద్రంలో నారికేళ స్వామి సోమ నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పడిపూజా కార్యక్రమాన్ని ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కర్ణాటక శివానంద (తంత్రి) దుబే సాయి కృష్ణ తంత్ర పూజరిలు అయ్యప్ప పూజ కార్యక్రమాలు నిర్వహించారు. శివానంద తంత్ర, అగ్నిగుండం నిర్వహించారు. గాయకులు దిలీప్, కృష్ణ గురు స్వాములు భజన పాటలు ఆలకించారు. పద్దెనిమిది మెట్లకు పూజలు నిర్వహించి వెలిగించారు. వందల సంఖ్యలో అయ్యప్ప దీక్ష స్వాములు పడిపూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, శ్రీనివాస్, సూర్యకాంత్, రవీందర్, నరేష్, కృష్ణ, సతీష్, గురు స్వాములు పాల్గొన్నారు.

తర్లపాడ్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. గ్రామంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో నిర్వహించిన సంఘం సమావేశంలో అధ్యక్షులుగా దాదే రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల రాజశేఖర్, కోశాధికారిగా చింతపండు లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా పొలంపెల్లి సచిన్, సంయుక్త కార్యదర్శిగా రామిడి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

దుబాయ్ నుంచి వచ్చి గుండె పోటుతో మృతి

నవతెలంగాణ-ఖానాపూర్



గల్ఫ్ దేశంలో రాత్రనక పగలనక కష్టపడి శ్రమించి, కొత్తగా ఇంటిని నిర్మించుకుని ఇంటి గృహప్రవేశానికి దుబాయ్ నుంచి స్వగ్రామానికి వచ్చి గృహప్రవేశం పూర్తి అయిన మూడు రోజులకే గుండెపోటుతో యువకుడు మృతి చెందిన సంఘటన ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన జోగు రవి(32) గత ఐదు సంవత్సరాల క్రితం నుంచి బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. కష్టపడి డబ్బులు జమ చేసి ఖానాపూర్‌లోని శ్రీరామ్ నగర్‌లో కొత్త ఇల్లును నిర్మించుకున్నాడు. ఇల్లు నిర్మాణం పూర్తి కావడంతో గృహప్రవేశం చేసుకోవాలని పది రోజుల క్రితం ఖానాపూర్‌కు వచ్చాడు. ఆదివారం గృహప్రవేశ కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్నాడు. కాగా పండుగలు పూర్తి చేసుకుని ఆనందంగా కుటుంబ సభ్యులతో గడిపాడు. కాగా మంగళవారం రాత్రి రవికి చాతిలో నొప్పి రావడంతో వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రవి అప్పటికే మృతి చెందారని వైద్యులు పరీక్షలు చేసి నిర్ధారించారు. దీంతో ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఎంతో సంతోషంతో గృహప్రవేశానికి వచ్చిన రవి మృతి చెందడంతో ఖానాపూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య సుమలత ఒక కుమారుడు కూతురు ఉన్నారు. అంతేకాకుండా తనపై ఆధారపడి ఉన్న ఇద్దరు వృద్ధ తల్లిదండ్రులు సైతం ఉన్నారు. ఈ సంఘటనతో శ్రీరామ్ నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

బేలలోనే పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బేల మండల కేంద్రంలోనే ఓయూ పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. బుధవారం విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని బేలలోనే కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ మాట్లాడుతూ గతంలో బేల మండల కేంద్రంలోనే ఓయూ డిగ్రీ పరీక్ష కేంద్రం ఉండేదన్నారు. ఈ సంవత్సరం కేంద్రాన్ని ఆదిలాబాద్‌కు మార్చారని తెలిపారు. దీని కారణంగా మండల కేంద్రంతో పాటు చుట్టూ పక్కల విద్యార్థులు ఆదిలాబాద్‌కు రావలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు దీనిపై స్పందించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించేలని అన్నారు. బేల మండల కేంద్రంలోనే డిగ్రీ సెంటర్‌ను కొనసాగించాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. తొమ్మి గంటల పరీక్షకు బేల మండలం మసాల నుంచి రావాలంటే ఉదయం 4 గంటలకు లెవాల్సి వస్తుందని అన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉందని డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థినీ శ్రావణి అన్నారు. అక్కడి నుంచి పంపాడానికి తల్లిదండ్రులు బయపడుతున్నారన్నారు. దీంతో తాము చదువులకు దూరం అవుతున్నామన్నారు. అధికారులు వెంటనే పరీక్ష కేంద్రాన్ని అక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు హరిష్, మనోజ్, సాయి, అస్లం ఉన్నారు.

ఆనందంలో అన్నదాత

- సన్న ధాన్యానికి మంచిధర
- క్వింటాల్‌కు రూ.3వేల నుంచి రూ.3100 ధర పెడుతున్న వ్యాపారులు
- ఎకరాకు రూ. 55 నుంచి రూ.60 వేల రాబడి

ఈసారి సన్నరకం వరి ధాన్యానికి ప్రయివేట్ మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. వ్యాపారులు క్వింటాలుకు రూ.3వేల నుంచి 3100 ధర చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఎప్పుడు కూడా ఈ స్థాయిలో ధర పలుకని సన్న రకాలకు ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో సదరు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి కనిష్టంగా 17 నుంచి 19 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చినట్లు రైతులు తెలిపారు. ఎకరానికి రూ.21వేల పెట్టుబడి ఖర్చులు పోను, రూ.40వేల వరకు అదనంగా లాభం వచ్చినట్లు చెబుతున్నారు.



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

మండలంలో ఈసారి 22వేల 6వందల ఎకరాల్లో వరిసాగు చేశారు. సుమారు ఇరవై శాతం మంది రైతులు సన్నరకాలైన జై శ్రీరాం, కావేరి చింటు, రైతుమిత్ర, సోనామసూరి వంటి వాటిని సాగు చేశారు. గతేడాది సన్న రకాలకు క్వింటాల్‌కు రూ.2వేల 5వందల నుంచి 2వేల 7వందలు మాత్రమే ధర పలికింది. ఈసారి క్వింటాల్‌కు గతేడాది కంటే రూ.4వందలు ధర ఎక్కువగా ఉండటంతో సన్నరకాలను సాగుచేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నిరాశ పరిచిన దొడ్డు ధాన్యం దిగుబడి

ఈసారి దొడ్డురకం ధాన్యం దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. గతంలో సన్నరకాలతో ఎదురైన నష్టాల దృష్ట్యా మండలంలో ఈసారి ఎక్కువ శాతం రైతులు దొడ్డు రకం వరి పంట సాగు చేశారు. గతంలో కంటే అయిదారు క్వింటాల్‌ల దిగుబడి తక్కువగా రావడంతో సదరు రైతులు నిరాశలో ఉన్నారు. ఎకరానికి దొడ్డురకం ధాన్యం 21 నుంచి 23 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చినట్లు సదరు రైతులు తెలిపారు. దొడ్డు రకాలైన 1001, 1010, ఐఆర్ 64, కూనారం, 1156 తధితర వాటికి ప్రయివేట్ మార్కెట్‌లో ఆశించిన ధరలేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.2వేల 2వందలు మద్ధతు ధర ఉంది. ఈక్రమంలో దొడ్డు రకం ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటున్నారు. ఎకరాకు పెట్టబడి ఖర్చులు పోను రూ.18వేలు మాత్రమే మిగులుతున్నట్లు రైతులు చెప్పారు. కౌలు రైతులకైతే కేవలం రూ.12వేలు మాత్రమే మిగిలినట్లు తెలిపారు. ఖరీఫ్ ప్రారంభంలో సదర్‌మాట్ ఆయకట్టుకు సమయానికి నీరు విడుదల చేయక పోవడం వల్ల సన్న రకాల పంటను సాగుచేసే అవకాశం లేక నష్టపోయినట్లు పలువురు రైతులు వాపోయారు.

ఆశించిన కంటే ధర ఎక్కువే ఉంది

తొమ్మిది ఎకరాల్లో సన్న రకం వరిసాగు చేశాను. ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ధాన్యాన్ని కుప్పలు పోసి నిల్వ ఉంచాను. గతంలో కంటే ఈసారి ధర ఎక్కువ ఉంది. గతంలో రెండేండ్లు సన్నరకాలు తెగుళ్ల బారిన పడి పంట సరిగా రాక నష్టపోయాను. ఈసారి దిగుబడితో పాటు ఆశించిన కంటే ధర ఎక్కువగా ఉంది.



గోపాల్ రైతు, ఖానాపూర్

ఫ్యాక్టరీ పనులు నిలిపేదాక పోరాటం ఆగదు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపేదాక పోరాటం ఆగదని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామ ప్రజలు, నాయకులు అన్నారు. బుధవారం రోడ్ నెంబర్ ఎన్‌హెచ్ 61 పాత బస్టాండ్ సమీపంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఫ్యాక్టరీ పనులు ఆపివేయాలని నాయకులకు, అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఫ్యాక్టరీ పనులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పంటపొలాలకు, నది జలాలకు పొంచివున్న ముప్పు..

ఇథనాల్ ఫ్యాక్టరీ స్థాపనతో చుట్టుపక్క దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్ని, బన్సపల్లి, కంజర్, సాంగ్వి, న్యూలోలం, మాడేగాం తదితర గ్రామాలకు అధిక శాతం కాలుష్యంతో సమస్యలు తలెత్తుతాయని ఆవేధన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్గంద వాయువుతో, వ్యర్థపు నీరుతో ప్రజలు అనారోగ్యాలపాలై ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అన్నారు. గోదావరి నదిలో వ్యర్థపు నీరు కలవడంతో నది నీరు కలుషితమయమై చేపలు, వన్య ప్రాణులు, తదితర జీవరాశి జీవనం ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు.

రాస్తారోకోతో వాహనాల దిగ్బంధం..

దిలావర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన నాయకులు, రైతులు, యువకులు జాతీయ రహదారి 61 పాత బస్టాండ్ సమీపంలో రాస్తారోకోతో వాహనాలను దిగ్బంధం చేశారు. దాదాపు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించగా నిర్మల్ వైపు, భైంసా వైపు రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా కలెక్టర్ వచ్చి ఖచ్చితమైన హామీ ఇచ్చే వరకు కదిలే ప్రసక్తే లేదని రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, నర్సాపూర్ ఎస్సై రవీందర్ నాయకులను, రైతులను బుజ్జగించినా ఫ్యాక్టరీ పనులు నిలిపివేస్తామని హామీ ఇచ్చేవరకు కదిలేది లేదని పట్టు పట్టడంతో డీఎస్పీ ఫ్యాక్టరీ స్థలానికి వెళ్లి ఫ్యాక్టరీ మేనేజర్ తో హామీ ఇప్పిస్తానని అన్నారు. దాంతో రైతులు, నాయకులంతా ఫ్యాక్టరీ ప్రాంతానికి తరలి వెళ్లారు. తహసీల్దార్ సరితను పిలిపించి రైతులకు తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇకనైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని ఫ్యాక్టరీ పనులు పూర్తిగా నిలిపివేయాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రైతులు, నాయకులు హెచ్చరించారు.



కార్మికులకు అండగా కమ్యూనిస్టు పార్టీలు : సీపీఐ

- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మికులకు అండగా కమ్యూనిస్టు పార్టీలు అండగా నిలిచి, అనేక ఉద్యమాలు చేశామని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కట్ట కిష్టస్వామి తెలిపారు. బుధవారం సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు గణపతి ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి పార్టీ సహాయ కార్యదర్శి దేవేందర్ ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. ప్రధాన విధుల గుండా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కిష్టస్వామి మాట్లాడుతూ కార్మిక లోకానికి అండగా నిలిచి, వారి హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీలు ఉద్యమించాయన్నారు. బుర్జువా పార్టీలు అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా తమ పోరాటలు సాగాయన్నారు. యువత కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేసేలా పార్టీలో చేరాలని కోరారు. వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో ఆవిర్భావ వారోత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. 99 సంవత్సరాలుగా ప్రజా, కార్మిక, కర్షక లోకం సమస్యల కోసం ఉద్యమించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు కుంటాల రాములు, నాయకులు దేవిదాస్, అరుణ్ కుమార్, రమేష్, బత్తుల గంగారెడ్డి, చంద్రమౌళి, మెస్రం భాస్కర్, జాషువా, పృధ్వీ, రాజు ఉన్నారు.

యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఎల్ఐసీ యాజమాన్య ఏకపక్ష వైఖరికి వ్యతిరేకంగా ఎల్ఐసీ ఉద్యోగులు, అధికారులు బుధవారం మధ్యాహ్నం బోజన విరామ సమయంలో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ జాయింట్ ఫ్రంట్ ఆదిలాబాద్ శాఖ కన్వీనర్ దౌలత్‌రావు మాట్లాడుతూ ఉద్యోగుల వేతన సవరణ చర్చలు వెంటనే ప్రారంభించాలని అన్నారు. నూతన పెన్షన్ పథకం కవర్ అవుతున్న ఉద్యోగులకు యాజమాన్యం చెల్లించే కాంట్రిబ్యూషన్ 10 నుంచి 14 శాతానికి పెంచాలని అన్నారు. అన్ని క్యాడర్లలో రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం నాయకులు కృష్ణ, శ్యాంరావు, సీహెచ్ అశోక్ కుమార్, సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎవీఎస్ సుధాకర్, డెవలప్‌మెంట్ సంఘం నాయకులు భాస్కర్, రవికిరణ్, వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు గణేష్, నసీరుద్దీన్, నీలానంద్, జగదీశ్వర్, సుమంత్ కుమార్, శ్రీనాథ్, సాయి కృష్ణ, ఫహీం సిద్దిక్, చంద్రశేఖర్, శ్రీరాం, శ్రీధర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రైతుబంధును విడుదల చేయాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటను సాగుచేస్తున్న రైతులకు రైతుబంధు డబ్బులు వెంటనే విడుదల చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 1లక్ష 64వేల 124 మంది రైతులు ఉండగా, వారం రోజుల క్రితం ప్రభుత్వం కేవలం 3 కోట్ల ఏడు లక్షల రూపాయలు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు. ఇంకను మిగిలిన రైతులకు వెంటనే రైతుబంధు డబ్బులను విడుదల చేయాలన్నారు. యాసంగి పంట పెట్టుబడి కోసం ఇప్పటికే రైతులు ప్రయివేట్ దళారుల వద్ద వడ్డీతో డబ్బులు తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యాసంగి పంట పెట్టుబడి కోసం వెంటనే డబ్బులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో రైతులు చిరంజీవి, గోదిరాం, జైరాం, రామ్ నివాస్ పాల్గొన్నారు.

పేదల కోసం బోస్లే గోపాలరావు కంటి ఆస్పత్రి



నవతెలంగాణ-ముధోల్

పేదల కోసమే బోస్లే గోపాల్‌రావు కంటి ఆస్పత్రి అని ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ అన్నారు. బుధవారం ముధోల్ భోస్లే గోపాల్‌రావు కంటి దవాఖాన 27వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరై ఆయన మాట్లాడారు. ఎందరో పేద కండ్లలో కాంతిరేఖలను నింపుతూ అందరి మన్ననలు పొందుతుందన్నారు. పేదవారికి ఉచిత పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూ పేద ప్రజలకు ఆపన్నహస్తంగా ముందు ఉంటుందని పేర్కొన్నారు. ఎల్వీ ప్రసాద్ కంటి విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ నేతృత్వంలో డాక్టర్ జి.ఎస్.రావు ఆధ్వర్యంలో 20 డిసెంబర్ 1996 సంవత్సరంలో ముధోల్ బోస్లే గోపాల్‌రావు కంటి దావఖాన ప్రారంభమైందని, దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న పేదలకు ఉచిత కంటి పరీక్షలతో పాటు అవసరమైతే ఉచిత శాస్త్ర చికిత్సలు నిర్వహించి, వారి కండ్లల్లో కాంతిరేఖలు నింపుతుందని పేర్కొన్నారు. 1996 నుంచి 2023 వరకు సుమారు 6లక్షల 68వేల 7వందల మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అందులో 82వేల 614 మందికి శాస్త్ర చికిత్సలు నిర్వహించగా, ఇందులో 39వేల 669 మంది పేద రోగులకు ఉచిత శాస్త్రచికిత్సలు నిర్వహించారు. అలాగే సుమారు 70మంది రోగులకు కను గ్రుడ్డు మార్పిడి శస్త్ర చికిత్సలు కూడా నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తుండటం అభినందనీయమని అన్నారు. ఆస్పత్రికి తన వంతు సహాయ సహకారం ఎల్లవేళలా ఉంటుందని పేర్కొన్నారు. అంతకుముందు ఆస్పత్రిలో వైస్ చైర్మెన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే వార్షికోత్సవ సందర్భంగా బెస్ట్ ఎంప్లాయ్‌గా సిబ్బంది అరవింద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డా.సోమశిలా మూర్తి, డా. దీక్ష, డా.వర్ష, డా.ఎస్ ఎస్ గోయాల్, ముధోల్ సర్పంచ్ రాజేందర్, ఆస్పత్రి నిర్వాహకులు సందీప్‌రావు, శ్రీకాంత్, నగేష్, సిబ్బంది లక్ష్మణ్ రాజేశ్వర్, అక్షయ, పెండెల లక్ష్మణ్, దత్తు, సాయన్న అభినందన్, గంగాధర్, విమల, సాయన్న విశ్వనాథ్, రాజేశ్వర్, నగేష్, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్నుల పండువగా ధర్మారం జాతర

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని ధర్మారంలోని కోతిదేవుని ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన జాతర కన్నులపండువగా కొనసాగింది. ఈ జాతరకు వచ్చిన దుకాణ సముదాయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువగా, రంగుల రాట్నం వద్ద పిల్లలు, యువతీ యువకులు మహిళలు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కోతి దేవున్ని దర్శించుకోవటం కోసం జనం బారులు తీరారు. జాతరకు వచ్చిన భక్తులు, ప్రజలకు ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎస్సై శ్రీకాంత్, షీటీం ఎస్సై సుమలత ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు. మహిళ షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుర్మ రాజేందర్‌రెడ్డి, నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, సురకంటి ముత్యం రెడ్డి, నాయకులు అడ్వాల రమేష్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై కంకర పడి పగిలిన అద్దాలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద



ఆర్టీసీ బస్సుపై కంకర రాళ్లు పడటంతో బస్సు అద్దాలు పగిలిన సంఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతి నగర్ ఎక్స్ రోడ్డు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి చింతల్‌చాంద వెళ్తున్న ఆర్టీసీ బస్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎక్స్ రోడ్డు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంపై నుంచి కంకర రాళ్లుపడ్డాయి. అటుగా బస్ రావడంతో ముందర అద్దాలపై పడటంలో అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఈ విషయం డీపో మేనేజర్‌కు తెలియజేయడంతో ప్రయాణికుల సౌకర్యార్థం వేరే బస్‌ను పంపించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఎద్దు మృత్యువాత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రమాదవశాత్తు బావిలో పడి ఎద్దు మృత్యువాత చెందిన సంఘటన ఆదిలాబాద్ మండలంలోని వాన్వట్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వాన్వవాట్ గ్రామానికి చెందిన సీడం శంభు సాయంత్రం ఎడ్లను బండి కట్టుకొని చేనులోకి వెళ్లాడు. బావి పక్కనే ఉండటంతో ఎడ్లకు నీరు తాపుతున్న క్రమంలో బావిలో ప్రమాదవశాత్తు ఎడ్ల బండితో సహా 2 ఎడ్లు బావిలో పడ్డాయి. ఒక ఎద్దు చనిపోయింది. మరో ఎద్దు సురక్షితంగా బయట పడింది. సుమారు ఎద్దు విలువ రూ.50 వేల వరకు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
గురువారం | డిసెంబర్ 21, 2023 | www.navatelangana.com

ప్రభుత్వ ఆసుపత్రిలో అప్రెంట్‌షిప్ సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు రెండు సంవత్సరాలు పూర్తైన తర్వాత అప్రెంటిషిప్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జెడ్పీటీసీ మేముల సంతోష్ అన్నారు. బుధవారం కుమురం భీం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ చెన్న కేశవులకు డీఐఈఓ నైతం శంకర్‌తో కలిసి వినపత్రం అందించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేసిన వారికి అప్రెంటిస్ లేక పోవడంతో ఉద్యోగలకు అర్హులు కాదనడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్రంటిస్ కల్పించేల విధంగా చూడాలని కోరారు.



ప్రజలకు మెరుగైన సేవలందించాలి : డీఎస్పీ

నవతెలంగాణ-పెంచికల్ పేట్

ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి పోలీసులు కృషి చేయాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి నమోదైన కేసులు, తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నిర్భయంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేల వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై కొమురయ్య పాల్గొన్నారు.



'అవిశ్వాస' రగడ..!

- కలెక్టరేట్‌లోనే ఇరు గ్రూపుల వాగ్వాదం
- ఎట్టకేలకు అవిశ్వాస నోటీసును డీఆర్‌ఓకు అందించిన కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్‌లపై మెజార్టీ కౌన్సిలర్లు ఎట్టకేలకు బుధవారం అవిశ్వాస నోటీసును డీఆర్‌ఓ కదం సురేష్‌కు అందించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఈ నోటీసులను కౌన్సిలర్లు అందించారు. మున్సిపాలిటీలో 30 మంది కౌన్సిలర్లు ఉండగా, ఇందులో 24 మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులపై సంతకాలు చేశారు. వీరంతా ఉదయం పదిన్నరకు కాగజ్‌నగర్ నుండి బయల్దేరి ఆసిఫాబాద్‌కు చేరుకున్నారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌ఓ సురేష్‌కు నోటీసు అందించేందుకు ఆయన ఛాంబర్‌లోకి వెళ్లారు. వీరి వెంట అవిశ్వాస నోటీసుపై సంతకం చేయని మరో కౌన్సిలర్ కూడా డీఆర్‌ఓ ఛాంబర్‌లోకి వెళ్లడంతో మిగిలిన కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. అతన్ని బయటకు వెళ్లగొట్టే ప్రయత్నంలో ఆ కౌన్సిలర్ షర్ట్ చిరిగింది. అవిశ్వాస నోటీసును డీఆర్‌ఓకు అందించి బయటకు వచ్చారు. అప్పటికే ఇతర పని మీద మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌తో పాటు అతని వర్గీయులు కలెక్టరేట్‌కు వచ్చి ఉన్నారు. దీనితో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అసమ్మతి కౌన్సిలర్లు, ఛైర్మన్ వర్గీయుల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడినా తర్వాత శాంతించారు.



కలెక్టర్ కార్యాలయం ముందు అసమ్మతి కౌన్సిలర్లు

ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాస నోటీసులు

కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌తో పాటు వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్‌పై 24 మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసులు అందించారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లపై వేర్వేరుగా అందించిన అవిశ్వాస నోటీసులపై 25 మంది కౌన్సిలర్ల పేర్లు ఉన్నా సంతకాలు మాత్రం 24 మందివే ఉన్నాయి. వార్డు నెం.11 కౌన్సిలర్ మహ్మద్ వలీ పేరు అందులో పేర్కొన్నా, అతని సంతకం లేకపోవడంతో 24 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన నోటీసులనే డీఆర్‌ఓకు అందించారు.

అవిశ్వాసం వెనుక అభయహస్తం ఎవరిది?

గత మున్సిపల్ ఎన్నికలలో కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులకు గాను 22 వార్డులలో బీఆర్ఎస్ విజయం సాధించి ఏకపక్షంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను కైవసం చేసుకుంది. తర్వాత మిగిలిన కౌన్సిలర్లు కూడా అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీవైపే మొగ్గు చూపడంతో కౌన్సిల్‌లో ప్రతిపక్షం అనేదే లేకుండా పోయింది. ఈ తరుణంలో సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లే ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లపై అవిశ్వాస నోటీసులు అందించడం ఇపుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ పార్టీకి నియోజకవర్గంలో పెద్ద దిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఇప్పటి వరకు ఈ విషయంలో నోరు మెదపకపోవడం పలు అపోహలకు దారి తీస్తోంది. కౌన్సిల్‌లో తమ పార్టీ రెండుగా చీలిపోతున్నా ఆయన తన వైఖరిని బహిర్గతం చేయడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఛైర్మన్ సద్దాం హుస్సేన్ పట్టణంలోని అన్ని వార్డులలో కోనేరు కోనప్ప గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఒకానొక సందర్భంలో కోనప్ప గెలువకపోతే తాను గుండు గీయించుకుంటానని కూడా సవాల్ చేశారు. ఇపుడు అదే ఛైర్మన్‌పై స్వంత పార్టీ కౌన్సిలర్లే అసమ్మతి వ్యక్తం చేస్తూ అవిశ్వాస నోటీసు ఇస్తుంటే ఎందుకు ఇరువర్గాలను సముదాయించే ప్రయత్నాలు చేయడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే మద్దతుతోనే అసమ్మతి కౌన్సిలర్లు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లపై అసమ్మతి వ్యక్తం చేస్తున్నారా అనే సందేహాలు రేకెత్తుతున్నాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 24 మంది కౌన్సిలర్లు, ఇందులో 22 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లే బీఆర్ఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌కు వ్యతిరేకంగా నోటీసు అందిస్తే ఆ పార్టీకి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప ఎందుకు మౌనం వహిస్తున్నాడనే సందేహమే ఇపుడు పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.



కలెక్టరేట్‌లో అసమ్మతి కౌన్సిలర్లు, ఛైర్మన్ అనుచరుల మధ్య ఘర్షణ వాతావరణం

పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్ జాబితా తయారీతో పాటు ఎన్నికల పకడ్బందీ నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీఓ కదం సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ త్వరలో పార్లమెంటు ఎన్నికలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు అయ్యే విధంగా చూడాలన్నారు. దీని కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మార్పులు చేర్పులు, చిరునామా మారిన వారు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల్లో తహసీల్దార్లు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నేరాల నియంత్రణకు పకడ్బంది చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్ అన్నారు. బుధవారం పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా ప్రవర్తించి కేసు వివరాలు తెలుసుకోవాలని సూచించారు. జాప్యం లేకుండా కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘాపెట్టి నేరాలను అదుపు చేయాలన్నారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల వేగంగమైన స్పందన ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ సరిగా లేని వాహనాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా తమ విధులు క్రమశిక్షణతో నిర్వహించాలని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను వివరించి, సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సై రాజశేఖర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డిపార్ట్‌మెంట్ ఉద్యోగాల్లో క్రమశిక్షణ ఉండాలి



జైపూర్: పోలీస్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగానికి ఎంపికై వారు క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎస్సై ఉపేందర్ సూచించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 13 మంది అభ్యర్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక కావడంతో వారితో బుధవారం మాట్లాడారు. విధులు, బాధ్యతలు వివరించిన ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ రక్షణగా పని చేయాల్సివుంటుందని తెలిపారు. సమాజం పట్ల అవగాహణతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించాలన్నారు.

ఘనంగా ఆదివాసుల సట్టి పూజలు



కాసిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని కుర్రేఘడ్ గ్రామంలో బుధవారం శ్రీశ్రీశ్రీ పాహుండి కూపర్ లింగు స్వామి, భీమన్న దేవుని సట్టి పూజలు ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమానికి ఆదివాసీలు వారి సంస్కృతి, సాంప్రదాయాలతో డోలు, వాయిధ్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం కాలినడకతో గోదావరికి తరలివెళ్లి స్నానం చేసి సాంప్రదాయ పూజలు చేసి ఇంటికి చేరుకొని భీమన్న దేవునికి చిక్కుడు, కంది, అనుము కాయలతో పాటు కొత్త పంటలను నైవేద్యంగా పెట్టి మొక్కలు చెల్లించడం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్సేంగ భూదేశావ్ స్వామి, మాదవరావు, ఈశ్రు, పెందూర్ ప్రభాకర్, వల్క శ్రీను, రాము పటేల్, ఆడె జంగు పటేల్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా జడ్పీ ఛైర్మెన్ కోనేరు కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడ పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను జెడ్పీటీసీ నాగేశ్వరరావు, సంతోష్, డీఎస్పీ వెంకటరమణ, సీఐ రాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో కూడా గొప్ప వారిగా చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. క్రీడల వల్ల మానసిక శారీరక ఎదుగుదల సాధ్యమవుతుందన్నారు. క్రీడల్లో గెలుపు కోసం కృషి చేయాలని అది జీవితంలో ఎదుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో ఛైర్మెన్ ఆలీ బీన్ అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గంధం శ్రీనివాస్, నాయకులు సిద్దిక్ బాయి, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, ఏటీడీఓ క్షేత్రయ్య, జీసీడీఓ శకుంతల, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టాటాఏసీ పైనుండి పడి యువతి మృతి

చింతలమానేపల్లి : ప్రమాదవశత్తు బోలోరే వాహనం నుండిపడి యువతి మరణించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాల్వాయినగర్ గ్రామానికి చెందిన దుర్గం అఖిల(18) కూలీ పనులు చేస్తుంది. రోజులాగే బుధవారం ఉదయం పత్తి ఎరడానికి టాటా ఏసీ ట్రాలీలో గంగాపూర్‌కు కూలీలతో కలిసి వెళ్తుంది. వెనకల కూర్చోడవంతో ప్రమాదవశత్తు జారీ పడిపోయింది. తలకు తీవ్రగాయలయ్యాయి. గమనించిన తోటి కూలీలు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్టు వారు తెలిపారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కన్నెపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 21 నుండి కొనుగోలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. కొన్ని రోజులుగా పత్తి కొనుగోలు చేయడం లేదని అందిన ఫిర్యాదు మేరకు సీసీఐ ఉన్నత అధికారులతో మాట్లాడి కొనుగోలు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తేమశాతం 8 నుండి 12కు క్వింటాళుకు రూ. 7020 మద్దతు ధర ఉంటుందన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ హీటర్లకు మరమ్మత్తులు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో చెడిపోయిన సోలార్ హిటర్లను మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జిల్లా చలి తీవ్రతలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో ఉండే విద్యార్థులు ప్రతి రోజు చన్నీళ్ళతో స్నానం చేసి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ హిటర్లను ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి అమర్చిందన్నారు. కానీ అవి విద్యార్థులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదన్నారు. దీని కారణంగా విద్యార్థులు తీవ్రమైన చలిలో స్నానాలు చేయల్సి వస్తుందన్నారు. చలితీవ్రతను దృష్టిలో పెట్టుకొని వెంటనే సోలార్ హిటర్‌లను మరమ్మతులు చేసి విద్యార్థులకు అందుబాటులో తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గొడిసేల కార్తిక్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యపై అవగాహన

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలో తెలంగాణా గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ద్వారా బ్యాంకు వల్ల ఉపయోగాలు, సేవలను తెలియజేశారు. ప్రతి ఒక్కరు బ్యాంకు ఖాతా కలిగి ఉండాలని, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంకుల ఇన్స్‌రెన్స్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల కమల, ఫీల్డ్ ఆఫీసర్ గోపీకృష్ణ, కళాజాత బృంద సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మహాలక్ష్మి పథకం రద్దు చేయాలని ఆటో డ్రైవర్ల ఆందోళన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో తమకు ఉపాధి కరువైందని ఆరోపిస్తూ బుధవారం కాగజ్‌నగర్‌లో ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ముందుగా స్థానిక లారీ చౌక్ నుండి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కారణంగా తమ ఆటోలకు గిరాకీ లేకుండా పోయిందన్నారు. ఒక్కో ఆటోకు మూడు, నాలుగు రోజుల వరకు కూడా గిరాకీ దొరకక తాము ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం రద్దు చేయాలని, లేదా తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. నెలకు రూ.10వేల జీవనభృతి ఇవ్వాలని, రూ.5లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ సురేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. వీరి ఆందోళనకు సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే రాజకీయాలు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ జాఫర్



నవతెలంగాణ-కెరమెరి

స్వలాభం కోసమే రాజకీయాలు చేస్తున్నారని, విద్య రంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ ఆరోపించారు. బుధవారం మండలంలోని ఝరి ఆశ్రమ, ఉర్దూ సెకండరీ పాఠశాల సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి శాస్త్రీయమైన విద్యా విధానం అందాలన్న లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ పని చేస్తుందన్నారు. విద్యార్థులకు సమస్యలుండకుండా చూడాలని సూచించారు. పేద విద్యార్థుల సమస్యల పట్ల పాలకులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాయకులు ప్రజల కోసం పనిచేయడం లేదని, పెట్టుబడిదారుల కోసం పని చేస్తూ వారి స్వలాభం కోసం ఆస్తులు కూడబెట్టుకోవడం కోసమే రాజకీయాలు చేస్తున్నారని విమమర్శించారు. రాష్ట్రంలో నిరుపేదలకు విద్యా వైద్యం అందని పరిస్థితి ఉందన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. పెండింగ్‌లోన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వడై తిరుపతి, అడే బావజీ పాల్గొన్నారు.

హక్కులు కొనసాగాలంటే టీబీజీకేఎస్‌ను గెలిపించాలి

- బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు



నవతెలంగాణ-రెబ్బెన

కార్మిక హక్కులు ఎప్పటిలాగే కొనసాగాలంటే కేసీఆర్ నాయకత్వంలో టీబీజీకేఎస్‌ను గెలిపించాలని బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మాల్‌రాజ్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గోలేటి జీఎం కార్యాలయ డిస్పెన్సరీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు గృహ రుణం రూ. 30 లక్షలకు పెంచి వడ్డీ మాఫీ చేయిస్తామన్నారు. కోల్ ఇండియాలో లేని ఎన్నో హక్కులను కల్పించిన ఘనత తమ సంఘానిదని గుర్తు చేశారు. సింగరేణి ఉద్యోగులకు తెలంగాణ ఇంక్రిమెంట్, సకలజనుల సమ్మె వేతనం, ఉచిత విద్యుత్ లాభాల వాటా 18 శాతం నుండి 32 శాతంకు పెంచి లాభాలు పంచడం లాంటి ఎన్నో సౌకర్యాలు, హక్కులు కల్పించామన్నారు. జాతీయ సంఘాలు సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఎన్నికైతే ఉన్న హక్కులు పోతాయన్నారు. 27న ఎన్నికలలో బాణం గుర్తుకు ఓటు వేసి టీబీజీకేఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాష్ రావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ నల్లగొండ సదాశివ్, చర్చల ప్రతినిధి మంగిలాల్, జీఎం కమిటీ నాయకులు సమ్మయ్య చంద్రశేఖర్, వెంకటేష్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, నాయకులు రాజేశం, ముల్కల చంద్రయ్య, జీఎం ఆఫీస్ కార్యదర్శి గడ్డం రవీందర్, డిస్పెన్సరీ ఇన్‌చార్జి మండల శ్రీనివాస్, కమిటీ సభ్యులు యుగేందర్, వెంకయ్య దేవేందర్ ఆవుల శ్రీనివాస్, ఓరం కిరణ్, సౌందర్య, అర్చన పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | డిసెంబర్ 21, 2023 | www.navatelangana.com

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలో అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ ఎంఏ అలీం అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీలు, వేతనాల నమోదు, హరితహారం, నర్సరీల పెంపుదల, గ్రామపంచాయతీ నూతన భవనాలు, పారిశుద్యం తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. లక్ష్యానికి అనుగుణంగా గ్రామాల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీఓ నాగరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం

నవతెలంగాణ-జన్నారం



ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షా ఆధ్వర్యంలో మండలంలోని అయ్యప్ప స్వామి భక్తులకు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదానాన్ని స్వీకరించిన అయ్యప్ప స్వామి భక్తులు ఎన్ఎస్‌యూఐ నాయకులను ఆశీర్వదించారు. యువత రాజకీయాల వైపు అడుగులు వేయాలని, యువత రాజకీయాలలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుభాష్ రెడ్డి, మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, నందు, రమేష్, గంగన్న పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సీపీఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ మాట్లాడుతూ బుధవారం నుంచి జనవరి 26 వరకు పార్టీ ఆవిర్భావ వేడుకలను పట్టణ, మండల, గ్రామ స్థాయిల్లో నిర్వహించారు. ఇందులో భాగంగానే పార్టీ జెండాలను ఆవిష్కరించాలన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన పార్టీ నాటి నుండి నేటి వరకు బడుగుబలహీన వర్గాల పేద ప్రజలు, కార్మిక, కర్షకుల కోసం పోరాటలు చేసిందన్నారు. 26న మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రదర్శన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాసంఘాలు, కార్మికులు, కర్షకులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు మిట్టపెల్లి పౌల్, నక్క వెంకటస్వామి, వనం సత్యానారయణ, మహిళ సమాఖ్య పట్టణ కార్యదర్శి గాజుల మనక్క, డీహెచ్‌పీఎస్ నాయకులు మారపెల్లి రవి, ఆత్మకురి వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు ఈరవేని రవీందర్, మమిడాల సత్యం, నాయకులు శటగోపం కిష్టయ్య, తొకల రాజన్న, బైర కోమురెల్లి, దేవానంద్, గాజుల రాయమల్లు, పొలవేని చందర్ పాల్గొన్నారు.

సీఐటీయూను గెలిపిస్తే మెరుగైన రక్షణ కల్పిస్తాం



గేట్ మీగింగ్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూ యూనియన్‌ను గెలిపిస్తే కార్మికులకు మెరుగైన రక్షణ కలిపిస్తామని సీఐటీయూ యూనియన్ నాయకులు కార్మికులను కోరారు. బుధవారం ఆర్‌కే ఓసీపీలో గని కార్మికులతో నాయకులు గెట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన రక్షణ, మంచి వైద్యాన్ని అందించే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. సింగరేణిలో కొత్త బావులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఏ కార్మికుడైతే క్వార్టర్ల నివాసిస్తున్నాడో ఆ క్వార్టరు లేదా 250 గజాలు, రూ.30 లక్షలు వడ్డీ లేని రుణాన్ని ఇప్పిస్తామని హామీఇచ్చారు. కార్మికుని రికార్డులో ఉన్న మారుపేరులను సరిచేసి కార్మికుల వాడల్లో ఫిల్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం సింగరేణికి బాకీ యున్న రూ. 29 వేల కోట్లలను కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి తీసుకువస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇప్పిచ్చి కాంట్రాక్టు వ్యవస్థను లేకుండా చేసి మైనింగ్ కార్మికులు అవే పనులు చేసుకునే విధంగా అవకాశాన్ని కల్పిస్తామన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించుకుంటూ వెన్నంటి ఉంటూ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీఇచ్చారు. 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఉదయించే సూర్యునికి గుర్తు మీద ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మందమర్రి బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకట స్వామి, ఉపాధ్యక్షులు రామస్వామి, కోశాధికారి వడ్లకొండ ఐలయ్య, ఆవాల సంజీవ్, పిట్ సెక్రెటరీ బంగారు శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

వారసత్వ ఉద్యోగాలు కల్పించాం



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను జాతీయ సంఘాలు పొగొట్టితే, వారసత్వ హక్కు సాధించిన ఘనత టీబీజీకేఎస్, కేసీఆర్‌దని ఆ యూనియన్ ఏరియా మాజీ ఉపాధ్యాక్షుడు జే రవీందర్ పేర్కొన్నారు. బుధవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు పోగొట్టిన చరిత్ర జాతీయ సంఘాలదైతే, సింగరేణిలో కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. జాతీయ సంఘాలు ఏ మొహం పెట్టుకొని కార్మికులను ఓటు అడుగుతారన్నారు. టీబీజీకేఎస్ ఇప్పటికీ కార్మికులకు అనేక హక్కులను సాధించి ఎన్నో గ్యారంటీలను అందించడం జరిగిందన్నారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారమే కారుణ్య నియామకాలు చేపట్టి, జాతీయ సంఘాల కుట్రను భగ్నం చేసి కార్మికుల కుటుంబంలో సంతోషాన్ని నింపారన్నారు. కార్మికులు బాణం గుర్తుకే ఓటు వేసి తమ సంఘాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి కారుకూరి తిరుపతి, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ సారంగపాణి, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్ సెగ్గం శ్రీనివాస్, రాజేందర్, మస్క రమేశ్, రాజు, కమల్, రవి, కిరణ్, శివ, మనిబాబు, పోశం, అచ్చ ప్రదీప్ పాల్గొన్నారు.

ఎల్ఐసీలో వెంటనే వేతన సవరణ చేపట్టాలి

- మంచిర్యాలలో ఉద్యోగులు, అధికారుల నిరసన ప్రదర్శన

నవతెలంగాణ-హాజీపూర్

ఎల్ఐసీ సంస్థలో వేతన సవరణ చేపట్టాలని జీవిత బీమా సంస్థ మంచిర్యాల శాఖ ఉద్యోగులు, అధికారులు డిమాండ్ చేశారు. బీమా సంఘాల జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. పదహారు నెలల క్రితం చేపట్టాల్సిన వేతన సవరణ యాజమాన్య నిర్లక్ష్య వైఖరి కారణంగా ఇంకా అమలు కాలేదన్నారు. సంస్థ ప్రతి ఏడు లాభాలను ఆర్జిస్తున్న వేతన సవరణ చేపట్టక పోవడం నియంతృత్వానికి నిదర్శనమన్నారు. ఉద్యోగ నియామకాలు చేపట్టడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆలస్యం చేయకుండా సిబ్బంది ఆకాంక్షలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో మరిన్ని ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు సంజీవయ్య, మల్లేష్, ఆర్. రాజేశం, ఎం. రామదాసు, సతీష్, ప్రభాకర్, నరేష్, మాలతీదేవి, సుష్మ, శైలజ, పద్మావతి, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, సత్యనారాయణ, సౌమ్య, జగదీశ్వర్, హిమశ్రీ, మౌనిక, సోనీ పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

సత్తాచాటిన గురుకుల బాక్సర్లు



నవతెలంగాణ-హాజీపూర్

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన గుడిపేట ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. వివిధ విభాగాల్లో బరిలోకి దిగిన బాక్సర్లు నాలుగు పతకాలు కైవసం చేసుకున్నారు. ఎంజెపి బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగంలో ఏ ప్రేమ్ కుమార్(గోల్డ్ మెడల్), ఇంద్రవర్మ (బ్రాంజ్ మెడల్), అండర్-19 విభాగంలో పి పరమేష్(బ్రాంచ్ మెడల్), జే సంపత్(బ్రాంచ్ మెడల్) పథకాలు దక్కాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ బంగారు పతకం సాధించిన ఏ ప్రేమ్ కుమార్ మహారాష్ట్ర అకోలలో జరగబోయే ఎస్జీఎఫ్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొట్టే దేవేందర్‌ను ప్రిన్సిపల్‌తో పాటు అసిస్టెంట్ ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్, డిప్యూటీ వార్డెన్ సందీప్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి చర్యలు చేపట్టాలని డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్‌వి కే శ్రీనివాస్, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి వెంకటేశ్వర రెడ్డి సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవ రెడ్డి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్పత్తి అయిన బొగ్గును రవాణా, నాణ్యమైన గ్రేడ్‌లో ఉత్పత్తి అయిన బొగ్గును వినియోగదారులకు సరైన సమయంలో అందించడానికి కావాల్సిన చర్యలు, ఓబి వెలికితీతపై సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గానూ ఇప్పటివరకు ఉత్పత్తి చేసిన బొగ్గు తక్కువగా ఉందని, లక్ష్యలను చేరుకోవడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు ఎం శ్రీనివాస్, పురుషోత్తమ రెడ్డి, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

80 శాతం స్థానికులకే సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగాలు



వివేక్‌ను కలిసిన పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగాల్లో 80 శాతం స్థానికులకు అవకాశం కల్పిస్తామని సింగరేణి డైరెక్టర్ బలరామ్ ప్రకటించడం పట్ల ప్రభావిత గ్రామాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కృషి ఫలితంగా సింగరేణి యాజాన్యం సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగాలు స్థానికలకు ఇవ్వడానికి అంగీకరించిందపి పేర్కొన్నారు. బుధవారం ఉదయం హైదరాబాద్ సర్పంచులు వివేక్ వెంకటస్వామిని కలిసి శాలువాతో సన్మానించడంతో పాటు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి అవసరాల కోసం వ్యవసాయ భూములిచ్చిన పరిసర గ్రామాల వారికి జరిగిన నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతర్ రెడ్డికి తెలియజేసిన ఎమ్మెల్యే కృషి ఫలించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రెండు రోజుల్లో సింగరేణి యాజమాన్యం 80 శాతం కాంట్రాక్టు ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వనున్నట్లు ప్రకటించిందని పేర్కొన్నారు. కొంత కాలంగా ఇదే అంశంపై డిమాండ్ చేస్తున్న వారి ఆశయం నెరవేరిందన్నారు.గత ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులపెడింగ్ బిల్లుల చెల్లింపుకు కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించినట్లు తెలిపారు. సర్పంచుల అభ్యర్థనపై ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత మంత్రితో మాట్లాడటంతో పాటు సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో సర్పంచులు పాలమాకుల లింగారెడ్డి, పద్మజ పాపిరెడ్డి, జైపాల్ గౌడ్, గోనె సుమలత నర్సయ్య, నామాల సత్యవతి తిరుపతి, పండుగ రాజన్న ఉన్నారు.

మామిడిపల్లి సర్పంచ్‌గా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ శ్రీనివాస్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించారు. విచారణలో రికార్డులు అన్ని సక్రమంగానే ఉన్నాయని నివేదిక రావడంతో కలెక్టర్ సస్పెన్షన్‌ను ఎత్తివేశారు. బుధవారం బాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న తనను కావాలని నాయకులు కావాలని కక్ష సాధింపుగా సస్పెండ్ చేయించారని అన్నారు. చివరకు న్యాయమే గెలిచిందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, జెడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, ఎంపీడీఓ మల్లేశం, ఎంపీఓ శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్యామల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

IN THE COURT OF HONOURABLE FIRST ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT MANCHERIAL
O.S. No. 246 OF 2023
Between:
Nallabelli Vijaya and others ...Plaintiffs
//AND//
Nallabelli Mahipal and another ...Defendants
To
To whom so ever it may concern.
Whereas the above named plaintiffs have filed the above suit for declaration of status. The said suit stands posted to on: 27-12-2023 for appearance.
Hence, if any person/s has/have any interest in the above case, may appear before the Court on: 27-12-2023 at 10-30 A.M., either in person or through an advocate duly authorized, and to answer the claim. Failing which, the matter will be heard and determined according to law.
// BY the Order of Court//
Date: 20-12-2023
Place: Mancherial
Sd/-
ANUGU JAYAPAL REDDY
B.Sc LL.B.(Dip) Cyber law
ADVOCATE, MANCHERIAL (TS)
Cell: 9908723880.

పత్తి రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-నస్పూర్

రైతులు పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే క్రమంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల మేరకు 8 శాతం నుండి 12 శాతం తేమ మించకుండా తమ ఇంటి వద్దనే ఆరపెట్టుకొని నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి కనీస మద్దతు ధర రూ.7 020 పొందాలన్నారు.

మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం కోసం కీడ్రలు

నవతెలంగాణ-జన్నారం

మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కోసం కీడ్రలకు ఎంతో దోహదం చేస్తాయని డీఈఓ యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని కలమడుగు జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 13 జట్లు, పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. ఉపాధ్యాయులు డ్రెస్ కోడ్‌తో విద్యార్థులకు బోధించడం ఆనందంగా ఉందన్నారు. క్రమశిక్షణతో చదివితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చన్నారు. పదవ తరగతి విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. వంద శాతం హాజరు శాతం ఉన్న ఇద్దరు విద్యార్థులను శాలువాతో సత్కరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి, ఇన్నారెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, సర్పంచ్ యాదగిరి కార్తికరావు, ఎంపీటీసీ స్వరూప, ఉప సర్పంచ్ రాజన్న, పీడీ సాగర్ రాజేందర్, యాకుబ్, తిరుపతి, జాడి మురళి, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముఖ కమలాకర్, ఉపాధ్యాయులు రమేష్, సత్యం, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న డీఈఓ యాదయ్య

పేదింటి ఆడపిల్ల పెండ్లికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన నిర్మల అనే యువతీ పెళ్లికి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తల్లిదండ్రులు చనిపోవడంతో నానమ్మ వద్ద ఉంటుంది. పేద కుటుంబం కావడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఖర్చుల నిమిత్తం రూ. ఐదు వేలు జెడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, సర్పంచ్ శ్రీనివాస్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు కష్టాల్లో ఎమ్మెల్యే అందుబాటులో ఉంటు పేదలకు సహకారం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం రామచందర్, ఉప సర్పంచ్ బల్లికొండ శ్యామల, జంజిరాల పెద్దయ్య రాజేష్, జనార్ధన్ పాల్గొన్నారు.

గుర్తింపు సంఘం ఎన్నికల వాయిదాకు కుట్రలు



నవతెలంగాణ-జైపూర్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా వేయించానికి యాజమాన్యంతో కుమ్ముక్కైన కొన్ని కార్మిక సంఘాలు కుట్ర చేస్తున్నాయని ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య ఆరోపించారు. బుధవారం ఇందారం-1ఏ గని కార్మికులతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం కాల పరిమితి దాటి సంవత్సరాలు గడుస్తున్నా యాజమాన్యం ఎన్నికలు నిర్వహించకపోగా ఎన్నికల వాయిదాకు ప్రయత్నిస్తోందని విమ్మర్శించారు. యాజమాన్యానికి తోడు సింగరేణిలో గుర్తింపు పొందిన 10 కార్మిక సంఘాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్ మినహా మిగిత ఏడు సంఘాలు ఎన్నికల వాయిదాకు సహకరిస్తున్నాయని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటు వేయాలని ఒక వైపు కోరుతూ, మరో వైపు ఎన్నికల వాయిదాకు కుట్ర చేస్తున్న తీరును సింగరేణి కార్మికులు గమనిస్తున్నారన్నారు. సింగరేణి గని కార్మికుల శ్రేయస్సు కోరి అహర్నిషలు కార్మికుల హక్కుల సాధన కోసం పరితపించే ఏఐటీయూసీ కార్మిక సంఘాన్ని గుర్తింపు సంఘంగా ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇందారం-1ఏ గని పిట్ కార్యదర్శి చింతల నవీన్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శి బాజీసైదా, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-కాసిపేట

మనస్తాపానికి గురై మహిళ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని దేవాపూర్ గ్రామంలో జరిగింది. ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్షెటిపెట మోదెలగ్రామానికి చెందిన మల్లీశ్వరి(50) కొడుకు సాయి కృష్ణ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి అదే బాధలో ఉంది. మంగళవారం సాయంత్రం దేవాపూర్‌లో నివాసం ఉంటున్న పెద్ద కూతురు శాతరాశి శైలజ ఇంటికి భర్త చంద్రయ్యతో కలిసి వచ్చింది. బుధవారం ఉదయం మల్లీశ్వరి నిద్రలేచి బయటకు వచ్చి బావిలో దూకింది. బావితో శబ్దం రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు చూశారు. తాడు సహాయంతో బయటకు తీయగా అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.